


# లక్ష్మీదేవి నవ్వు

- మాలతీచందూర్

అసలేం జరిగిందంటే....

"మీరుత్త అమాయకులండీ" అంది లక్ష్మీదేవి. అలా అనటంలో - ప్రేమ కంటే కాస్త హేళన ధ్వనించింది నారాయణమూర్తికి. అప్పుడప్పుడు లక్ష్మీదేవి ఇలా మురిపెంగా అంటూంటే చిద్విలాసంగా చిరునవ్వు దాచుకుంటూ, ఆయన గారు అరమోడ్పు కన్నులతో ఈ ప్రపంచాన్ని వీక్షించటం కద్దు. అయితే ఈసారి అనటంలో కాస్త హేళన, నిర్లక్ష్యం ధ్వనించి - చిరుకోపం వచ్చి...

"మహా నువ్వేదో గొప్ప మేధావి వర్గానికి చెందినట్లు - నీ తెలివితేటల గురించి నాకు చెబుతున్నావా? ఆ బుర్రలో రేగడిమట్టి" నవ్వుతూ కాస్త తీక్షణంగానే అన్నాడు నారాయణమూర్తి.

లక్ష్మీదేవికి ఛర్రున కోపం వచ్చింది. విసురుగా లేచింది. భర్త గిరజాలు సవరిస్తున్న చేతిని అమాంతరం లాక్కుని లోపలికెళ్లిపోయింది. ఆ వెళ్లటం వెళ్లటం, మళ్ళీ కంటబడలేదు. నారాయణమూర్తి వెతికి వెతికి వేసారిపోయాడు. పోనీ పుట్టింటికి వెళ్లిందా?- అనుకుంటూ సప్త సముద్రాలూ గాలించాడు. ఊహూ; లక్ష్మీదేవి కనిపించలేదు.

ఛలోక్తులతో - చిలిపి కజ్జాలు పెట్టుకుని, నవ్వుతూ, నవ్వించి, కవ్వించి, కాలం కరిగిపోతున్నది తెలియకుండా, ఊపిరి సలపకుండా కబుర్లు చెప్పే - లక్ష్మీదేవి పక్కన లేకపోతే - పిచ్చెత్తినట్లుంది నారాయణమూర్తికి. ఆకలి దప్పికలు మర్చిపోయాడు. దేనిమీదా మనసు నిలపలేకుండా వున్నాడు. చుట్టూ పరిసరాలు నిర్జీవంగా వున్నట్లనిపిస్తున్నాయి. అలా గమ్యం లేకుండా పిచ్చివాడిలా తిరుగుతూ, నడుచుకుంటూ ఒక పల్లెటూరికి చేరుకున్నాడు.

అది మరీ పల్లెటూరు కాదు - పంచాయితీ బోర్డు. మేస్టర్లు లేని బడి - నీళ్లు లేని నుయ్యి, పాడుబడిన గుడి వగైరాతో - పవిత్ర భారతదేశంలో గల అనేక పల్లెటూళ్ల మాదిరిగా ఈ ఊరూ వుంది. ఊరి వెలుపల - ఊరి శివార్లలో, ఇటుకల్తో కట్టిన గోడలపైన తాటాకులు కప్పిన ఇల్లు, చుట్టూ ముళ్ల కంచెల్తో దడి. దడికి వెదురు బొంగుల గేటు. లోపల రెండు గేదెలు, ఇటూ అటూ పరుగులు పెట్టే కోడిపెట్టలు. ముంగిట విశాలంగా పరుచుకున్న గున్న మామిడి చెట్టు. ఆ చెట్టు కింద నులక మంచం. అయితే ఆ మంచం మీద మనుషులు ఎవరూ లేరు. దిక్కు తోచనట్లు అలా రోడ్డు మీద నిలుచున్న నారాయణమూర్తిని చూసి...

"ఎవరు కావాలండీ" అడిగాడు పాతిక, ముప్ఫై ఏళ్ల మనిషి. నల్లగా కర్ర వంటి శరీరం, ముఖం మంచి కళగానే వుంది.

నారాయణమూర్తి జవాబు చెప్పలేదు.

"గంజి తాగుతారా?"

"గంజా?"

"ఇవ్వాళ శ్రావణ అమావాస్య ఆదివారం. పొద్దుట నుంచి సాయంత్రం దాకా మేము గంజి పోస్తాం."

"దేనికి?"

"అదేం ప్రశ్న - అది మా ఆచారం. మా పూర్వీకుల నుంచీ వస్తున్న అలవాటు. లోపలికొచ్చి కాస్త గంజి తాగి వెళ్లండి. తీపిది ఇమ్మన్నారా? మజ్జిగ పోసి ఇవ్వమన్నారా?"

ఆకలిదప్పులు మర్చిపోయిన నారాయణమూర్తికి, ఆ క్షణంలో కడుపులో పేగులు కుయ్‌మన్నాయి. పొట్ట ఖాళీగా వుండి - ఎలకలు ఇటూ అటూ పరుగెడుతున్నట్లు అనిపించింది. ఈ గంజి ఎల్లా వుంటుందో రుచి చూద్దాం అన్నట్లు, నోరు మెదపకుండా ఆ మనిషి వెంట నడిచాడు. చెట్టు కిందున్న నులక మంచం మీద కూచోమని - లోపలికెళ్లి గ్లాసు నిండా గంజి, ఒక బాదం ఆకులో బెల్లం ముక్క - మరో ఆకులో నిమ్మకాయ ముక్క పెట్టి తీసుకొచ్చి, "మీకేం కావాలో అది నంజుకుని తాగండి - ఉల్లిపాయ కూడా తెమ్మన్నారా?" అడిగాడు ఆ వ్యక్తి.

నారాయణమూర్తి గ్లాసు అందుకుని కాస్త సందేహిస్తూ ఒక గుక్క తాగాడు. మంచి రుచిగా వుంది. పుల్ల మజ్జిగ కలిపినట్లున్నారు. పుల్ల పుల్లగా వుండి - ప్రాణం లేచి వచ్చినట్లయి - ఏకబిగిన రెండు గ్లాసుల గంజి తాగేశాడు - నిమ్మకాయ నంజుకుని. చాలా తృప్తిగా వుండి, ఆ క్షణాన ఏమీ జ్ఞాపకం రాలేదు, ఆఖరికి లక్ష్మీదేవి కూడా.

నువ్వేం చేస్తూంటావు - పొలం గట్రా ఎంత వున్నాయి, ఇత్యాది వివరాలు అయ్యాక...

"నీకు తీరని కోర్కెలు లేవా? ఏదన్నా కోరుకో," అన్నాడు నారాయణమూర్తి.

"కోరికలకేం, కావలసినన్ని వుంటాయి. అవి తీర్తే మనిషి దేముడైపోతాడు" అన్నాడు, శంకర్రావు అని తన పేరు చెప్పుకున్న ఆ యువకుడు. శంకర్రావుకి పెళ్ళయి ఇద్దరు పిల్లలు. ఏడో క్లాసు దాకా చదివి, వ్యవసాయం చేసుకుంటూ బ్రతుకుతున్నారు.

"చెప్పు, నీ కోరికలేమిటి? అవి తీరే దారి నేను చూపిస్తాను," అన్నాడు నారాయణమూర్తి.

పట్టుకోటానికి ఆధారం దొరికిన మనిషిలా... "నా పేరు ఈ వూళ్లో - ప్రతిచోటా కనిపించాలండీ..."

"ఈ ఊర్లోనా... లేక దేశం అంతటానా" అడిగాడు నారాయణమూర్తి. చదరంగంలోని బంటుని ముందుకు తోస్తున్నంత ఏకాగ్రతతో.

"వుట్టికెగరలేనమ్మా - స్వర్గానికి అన్నట్లు ఈ ఊళ్లో నా పేరు చెలామణి అవనివ్వండి" అన్నాడు శంకర్రావు.

నారాయణమూర్తికి మంచి ఉత్సాహంగా వుంది. లక్ష్మీదేవి తనని అమాయకుడంది. చెప్పా చెయ్యకుండా మాయమయింది. ఆమె లేకుండా తను బ్రతకలేననుకుంది. "ఇంక ఆ లక్ష్మీదేవిని వెతకను. ఈ మనిషి ద్వారా - నా ప్రయోజకత్వాన్ని నిరూపించుకుంటాను. ఇతన్ని గొప్పవాడిని చేస్తాను."

వారంలో వచ్చే పంచాయితీ ఎలక్షన్లలో నిల్చోమని వూళ్లో వాళ్లు అడిగినప్పుడు, మతిపోయినట్లు చూశాడు శంకర్రావు. కనపడ్డ ప్రతి గోడ మీదా 'నల్లాబత్తుల శంకర్రావు గారిని గెలిపించి గ్రామప్రగతికి

తోడ్పడండి' అని రంగు పెయింట్‌తో రాసినప్పుడు, శంకర్రావుకి - గంజి తాగి కంటికి కనిపించకుండా వెళ్లిపోయిన ఆ వ్యక్తి గురించి గొప్ప భక్తి నమ్మకం ఏర్పడింది. శంకర్రావు - ఎన్నికల్లో గెలిచి - మెంబ రవటమే కాదు - సరాసరి ప్రెసిడెంటు అయ్యాడు.

పూలదండల్తో - చుట్టూ వందిమాగధులతో ఇంటికొచ్చిన శంకర్రావుకి - నులక మంచం మీద నారాయణమూర్తి కనిపించేసరికి, గొప్ప ఆనందం కలిగి, కృతజ్ఞతాభావం మనసు నిండా పరుచుకుంది.

"ఎప్పుడొచ్చారు? మీరు మా ఇంట్లోనే వుండాలి. మీ కాళ్లు పట్టుకు వదలను," అంటూ సాష్టాంగపడే సరికి, నారాయణమూర్తికి ఇబ్బందిగా - గర్వంగా వుంది.

చిక్కని బర్రె పాలు ఎర్రగా కాచినవి పెద్ద గ్లాసు నిండా ఇవ్వబోయినప్పుడు "ఒద్దు, నాకు గంజి కావాలి. క్రిందటసారి ఇచ్చావే - అలాంటిది చేయించి ఇవ్వు" అన్నాడు నారాయణమూర్తి.

చుట్టూ మనుషుల్ని పంపేసి, కమ్మని మజ్జిగ కలిపిన గంజి గ్లాసుతో వచ్చి - నమ్రతగా గ్లాసు అందించి, నేల మీద, నారాయణమూర్తి కాళ్ల దగ్గర కూచున్నాడు శంకర్రావు.

"ఇదంతా మీ చలవే. మీరు పెట్టిన భిక్షే" అంటున్నాడు.

నారాయణమూర్తికి ఆ గంజి క్రిందటి మాటంత రుచిగా అనిపించలేదు. ఆ పులుపు, మజ్జిగలలో రుచి ఈసారి లేదు. అయినా శంకర్రావు చిన్నబుచ్చుకుంటాడేమోనని తాగేసి - నిమ్మకాయ ముక్క కొరికాడు.

"నీ మనసులో - కోరిక నేరవేరినట్లేనా? ఊళ్లో అన్ని గోడల మీదా నీ పేరే వుందిగా?"

"అవుననుకోండి" ఆగిపోయాడు శంకర్రావు.

"ఏం నీ మనసులో వున్న మాట చెప్పు? నీకింకా కోరికలున్నాయా?"

"పల్లెటూళ్లో ఏ మార్పు తెద్దామన్నా కుదరదండి. ప్రెసిడెంటన్నారా? చేతిలో కాని లేదండీ. ఊరిని ఎలా బాగు చేస్తాను?"

"అంటే - మీ ఊరు బాగుపడాలంటే, ఇంకా పేరు రావాలంటారా?"

"పేరొక్కటే చాలదండీ. అసలు ఈ ఊర్లో మటుకే వినిపించే పేరు అదేపాటి? మన ఊరు శివార్లు దాటితే నేనెవర్నో ఎవరికీ తెలియదు."

"పక్క వూర్లకి కూడా నీ పేరు వినిపించాలం టావా?"

"మంచి పనులు చెయ్యాలంటే - ఈ కాస్త పేరు చాలదండీ. జిల్లాలో, రాష్ట్రంలో మంతా పేరుండాలండీ."

"అంతేకదా! నీ పేరు జిల్లాలోనే కాదు, రాష్ట్రం అంతటా వినిపించేట్టు చేస్తాను. ఆ పేరు మంచి పనులు చేయటానికా? లేక అందరూ నీ గురించి చెప్పుకోవాలన్న తపనా?"

"ఊరూ, పేరూ లేనివాడి మాట ఎవరు వింటారండీ? ఒక మంచి పని చెయ్యాలంటే - పేరుండాలి."

"సరే, అదీ చూద్దాం" అంటూ ఎండ వాలు తూంటే - పొడుగాటి నీడలో తనూ కలిసిపోతూ నడక సాగించాడు నారాయణమూర్తి. ఈ శంకర్రావుకి ఎప్పుడు తృప్తి కలుగుతుంది? ఇతను ఎన్ని కోర్కెలు కోరతాడో చూడాలని వుంది. ఇతను కోరినవన్నీ ఇచ్చెయ్యాలి. "ఇప్పుడు నాకు తృప్తిగా వుంది - కోరికలు లేవండీ" అని అనిపించుకోవాలి. ఆ క్షణంలో తనకో ధ్యేయం దొరికినంత సంబరంగా వుంది నారాయణమూర్తికి. తాడూ బొంగరం లేకుండా తిరుగుతున్న తనకి, ఒక గమ్యం కనిపించింది. ఈ శంకర్రావుని సంతృప్తుడిని చెయ్యాలి. అంత కంటే తనకి మరో ధ్యాస లేదు. ఆ భావం మనసులో మెదిలేసరికి నారాయణమూర్తి పెదవులు సన్నగా నవ్వినాయి. అంటే తనకీ కోరిక వుందన్న మాట! స్వప్రయోజనం కోసం కాదని సరిపెట్టుకో జూశాడు నారాయణమూర్తి. కానీ అంతరాత్మ గింజు కోవటం మొదలుపెట్టింది.

ఆరు నెలల్లో వచ్చిన ఎలక్షన్సులో శంకర్రావు ఎసెంబ్లీకి నిలబడటం - గెలవటం చకచకా జరిగి పోయాయి. హైద్రాబాద్‌కి మకాం మార్చిన శంకర్రావుని చూసి రావాలని నారాయణమూర్తికి మహా ఉత్సాహంగా వుంది. అతనికి శంకర్రావు తరచుగా జ్ఞాపకం వస్తున్నాడు. కానీ శంకర్రావుకి - నారాయణమూర్తిని తలుచుకునే వ్యవధి వుండటం లేదు. ఊపిరి సలపని పని - కార్యక్రమాల్లో సతమతమవుతున్నాడు. మీటింగ్‌లు, పూలహారాలు, ఆశ్రితులు, ప్రమాణాలు, ఆస్తుల సంపాదన - చాలా బిజీగా వున్నాడు. ఒక రోజున నారాయణమూర్తి అనుకోకుండా రావటం సంభవించింది. శంకర్రావు అమాంతరం నారాయణమూర్తి పాదాల మీద పడి 'పాహిమాం - పాహిమాం' అన్నాడు నాటక ధోరణిలో.

"ఏమిటీ? నీ కోరిక తీరిందిగా? ఇంకా రక్షించమంటున్నావేమిటి?" అడిగాడు గంజి గ్లాసు ఎక్కడన్నా కనిపిస్తుందేమోనని చూస్తూ.

"అయ్యా నా బాధ మీకేం తెలుస్తుంది? శాసన సభ సభ్యుడినయినంత మాత్రాన ఏం ప్రయోజనం? మంత్రిగాని వాడి మాట ఎవరు వింటారండి? ఒక పక్క వరదలు - మరోవైపు కరువు - అవినీతి - వీటిని కంట్రోల్ చెయ్యలేకుండా వున్నారు. ఈ అక్రమాలని నా కళ్లతో చూడలేకుండా వున్నానండీ."

"ఏం చెయ్యమంటావ్?"

"మిమ్మల్నేం చెయ్యమని అనటం లేదండీ. మంత్రినై ఈ రాష్ట్రాన్ని గట్టెక్కించగల అవకాశం నాకు రాదే అని విచారిస్తున్నాను."

"అదా సంగతి. పోనీ, నీకు మంత్రి పదవి దొరికితే అప్పుడు తృప్తిగా వుంటుందా?"

"నా రాష్ట్ర ప్రజల సుఖం తప్ప నాకే కోరికా లేదండీ" అన్నాడు శంకర్రావు.

రెండు నెలల తరువాత జరిగిన మంత్రి వర్గ మార్పులలో శంకర్రావుని గద్దె ఎక్కించారు. మంత్రిగా పదవీ స్వీకారం అయింది. బాగా వొళ్లు చేశాడు. రంగు విరిగి, నలుపు కాస్త చామన చాయలోకి మారి, కళ్లలోకి అహమూ - ఆత్మ విశ్వాసమూ వచ్చాయి. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ఆరాటం దినదిన ప్రవర్ధమానమవుతూ వుంది. మంత్రి పదవి - పేరు, అధికారం ఇంత సునాయాసంగా చిక్కినప్పుడు, ఢిల్లీ వైపు మెడ చాచి చూడటంలో తప్పేమిటి? ముఖ్యమంత్రి ఛాన్సు లేనంత మాత్రాన - కేంద్రంలో మంత్రి పదవికి అర్హుడు కాదని ఎవరంటారు? అసలు తనకంటే ప్రయోజకుడు ఈ పవిత్ర భారతావనిలో ఇంకెవరున్నారు? కేంద్రంలో మంత్రి అయితే ఎంత అధికారం - ఎంత బలగం - దర్జా. ఇవన్నీ రాష్ట్ర మంత్రికి వస్తాయా? ఢిల్లీకి పరుగులు పెడుతూ - నారాయణమూర్తి కోసం ఎదురుచూస్తూ కాలం గడుపుతున్నాడు శంకర్రావు.

ఎప్పటిలాగానే చెప్పా చెయ్యకుండా నారాయణమూర్తి వూడిపడ్డాడు. ఈసారి శంకర్రావు అతని కాళ్ల దగ్గిర కూచోలేదు. ఎదురుగుండా వున్న సోఫాలో కూచుని నారాయణమూర్తిని - కుషన్‌లు వున్న సింహాసనం వంటి పెద్ద కుర్చీలో కూచోపెట్టాడు.

ఫ్రిజ్‌లోంచి - కుంకం పువ్వుతో ఘుమ ఘుమలాడుతున్న బాదంఖీర్ తెప్పించి, వంటవాడు ట్రే పట్టుకోగా, వంగి ఆ గ్లాసు ట్రేలోంచి తీసి, నారాయణమూర్తికి అందించాడు - వినయంగా.

"ఏమిటిది గంజా?"

"కాదు స్వామీ, బాదంఖీర్. బాదం పప్పులు స్టేట్స్‌వి వచ్చాయి. చాలా బాగుంటుంది. తీసుకోండి."

"నాకెందుకయ్యా ఇలాంటివి. మొదటి రోజున ఇచ్చావే - అలాంటి గంజి"

"మీరేమిటండీ - కాలంతో మారనంటున్నారు. ఏనాటి గంజో - ఇంకా అదే తాగుతానంటారా?"

"నేనంతేలే. మారను. ఎప్పుడూ ఒకే మాదిరిగా వుంటాను. అవును, నువ్వింకా శ్రావణ మాసంలో గంజి పోస్తున్నావా, పోయిస్తున్నావా?"

"ఎక్కడండీ. అంత తీరికేది. ఈ మహా పట్నాల్లో విస్కీ తాగుతారు గానీ గంజి ఎవరికి కావాలి? మీరింకా అమాయకంగా ఆలోచిస్తున్నారు" అన్నాడు శంకర్రావు.

నారాయణమూర్తికి వీపు మీద ఎవరో ఛళ్లున అంటించినట్లయింది, లక్ష్మీదేవి అన్న మాటలు జ్ఞాపకం వచ్చి - ఆవేశం, పౌరుషం ముంచుకొచ్చాయి.

"ఏవయ్యా - నీ కోరికలు పూర్తి అయినట్లేనా - ఇంకా ఏమన్నా వున్నాయా?" అడిగాడు.

శంకర్రావు లౌక్యంగా జవాబు చెప్పక చేతి గోళ్లు చూస్తూ కూచున్నాడు - పెళ్లిచూపులకొచ్చిన పెళ్లికొడుకులా.

"నీలో కోరికలు లేకుండా చెయ్యాలనే నా తపన. అందుకే కదా."

"దేశం అల్లకల్లోలమయిపోతోందండీ. మత కలహాలు, నల్ల డబ్బు, లంచగొండితనం, విద్రోహ చర్యలు, జనాభా పెరుగుదల, అవిద్య, దారిద్ర్యం, ఇలా ఎన్నో సమస్యలు. వీటిని నిర్మూలించాలంటే కేంద్ర ప్రభుత్వం పటిష్టంగా వుండాలండి. కేంద్రంలో బలమైన మంత్రినైతే తప్ప - ఈ దేశం బాగుచేయలేనండి."

"నువ్వనేదేమిటి?"

"మీకు తెలియనిదేముంది? దేశం ఛిన్నాభిన్నం అయిపోతున్నది. కేంద్ర మంత్రి అంటే ఉక్కులాంటి మనిషి - వెన్నలాంటి హృదయం కలిగి వుండాలండి."

"ఆ లక్షణాలు నీలో వున్నాయంటావ్?"

శంకర్రావు మాట్లాడలేదు.

నారాయణమూర్తి , ఎదుటనున్న శంకర్రావు ఉనికిని మర్చిపోయాడు. లక్ష్మీదేవి మాటలు అతని చెవుల్లో గింగురుమంటున్నాయి. "మీరు వుత్తి అమాయకులండీ" ఆమె ముఖంలో వేళాకోళం, పెదిమల చివరన హేళనతో కూడిన చిరునవ్వు.

లక్ష్మికి పాఠం చెప్పి తీరాలి. అందుకైనా ఈ శంకర్రావు కోర్కె తీర్చాలి. 'తథాస్తు' అన్నాడు వినీ వినపడనట్లు. నాలుగు నెలలు తిరక్కుండా - రాజ్య సభకి పార్టీవారు ఎన్నిక చేయడం, కేంద్ర మంత్రిత్వం శంకర్రావు వొళ్లో వచ్చిపడ్డాయి. అంతా ఆశ్చర్యంగా జరిగిపోయింది.

కేంద్రమంత్రి అయ్యాక విమానాల్లో దేశ విదేశాలు తిరుగుతున్న శంకర్రావు, నారాయణమూర్తిని పూర్తిగా మర్చిపోయాడనే చెప్పాలి. అతని నెత్తి మీద లెక్కపెడదామన్నా వెంట్రుకలు లేవు. జుట్టు పూర్తిగా రాలిపోయింది. బొజ్జ బాగా పెరిగింది. అతని శాఖలో, అతని మాటకు తిరుగులేదు. అతి పెద్ద ప్రజాస్వామ్యంలో ఒక ప్రముఖ మంత్రి. అధికార దర్పమూ - శక్తియుక్తులూ అన్నీ కొట్టిన పిండిలా అబ్బాయి. అయితే బయట దేశాలకి వెళ్లినప్పుడు పాదాల కింద ఎర్ర తివాచీలు పరిచినా, అమెరికా, రష్యా వంటి సూపర్ పవర్లలో గల మంత్రులకి లభించిన ప్రాముఖ్యత తనకి లేదన్న బాధ సూదిలా గుచ్చుకుంటూండేది.

విదేశాలకు వెళ్లినప్పుడు - అంతర్జాతీయ సెమినార్స్‌కి - కాన్ఫరెన్సులకీ వెళ్లినప్పుడు - తనకీ తన దేశానికీ వెయ్యవలసిన పెద్ద పీట వెయ్యటం లేదని కించగా వుండేది. అట్లాంటప్పుడు నారాయణ మూర్తి జ్ఞాపకం వచ్చి - ఒక్కసారి ఆయన కనపడితే బాగుండును అనుకునేవాడు.

శంకర్రావు ప్రార్థనని - విన్నట్టుగా ఒకరోజు నారాయణమూర్తి వూడిపడ్డాడు. శంకర్రావు ముఖంలో ఆయన ఆశించినట్లు తృప్తి కనిపించలేదు సరిగదా - ముఖం పీక్కుపోయినట్లుగా, జబ్బుపడి లేచిన వాడిలా కనిపించాడు.

"ఏమిటి ఈ మంత్రి పదవి కూడా నీకు తృప్తిని యివ్వలేకుండా వుందా?" అడిగాడు నారాయణ మూర్తి.

"ఈ వసుధైక కుటుంబానికి నేను భారత ప్రధాని పదవిలో తప్ప భద్రత ఇవ్వలేననుకుంటా."

"అంటే?"

"ప్రపంచ శాంతి కావాలంటే - యుద్ధాలు - అణు విధ్వంసాలు శాశ్వతంగా సమసిపోయి - ప్రపంచం సుఖశాంతులతో వర్ధిల్లాలంటే - నేను ఈ దేశానికి ప్రధానినై భారత జాతిని ముందుకి నడపాలి."

"అదీ నీవల్ల అవుతుందా?"

"ఎందుకు కాదు? ఒక మారుమూల పల్లె నుంచి ఇంతదాకా వచ్చిన వాణ్ణి. అది చేయలేనా?"

"ఆపైన నీకు కోరికలుండవా?"

"వుండవు. అదే నా ఆఖరి కోరిక" అన్నాడు శంకర్రావు నిశ్చలంగా.

నారాయణమూర్తి మనసులో లక్ష్మీదేవి తళుక్కున మెరిసింది. ఈ క్షణాన ఆమె తన పక్కనుంటే ఎంత బాగుండును? ఎక్కడుంది? నారాయణమూర్తి ఇంతవరకు తన దివ్య దృష్టిని ఉపయోగించలేదు. ఎప్పుడైతే తన దివ్య చక్షువుని ఉపయోగించాడో, ఆ మరుక్షణంలో లక్ష్మీదేవి తన మనస్సుని పుస్తకంలా చదివెయ్యగలదు. చదివి, భార్య లేకుండా బతకలేడని, వేళాకోళం చేసి - మరీ వెర్రిబాగుల వాడి కింద కట్టేస్తుందని లోపల భయం. కానీ, వుండబట్టలేకపోయాడు. ఈ ఒక్క కోరికా తీర్చేస్తే - శంకర్రావుకి మరి కోరికలుండవు. కోరికలు లేని మానవుడు ఒక్కడైనా ఈ భూమ్మీద కనీసం ఒక్కడైనా వున్నాడని లక్ష్మీదేవికి రుజువు చెయ్యొచ్చు. ఈ అవకాశం ఒదులుకోకూడదు. అంతదాకా పట్టుదలగా వున్న నారాయణమూర్తి - ఇంక ఆగలేక తన దివ్య దృష్టిని ప్రసరించటం ఆరంభించాడు. లక్ష్మీదేవి ఎక్కడ దాక్కుంది? తన కంటికి కనపడకుండా ఎక్కడుంది?

సముద్రాలు, పర్వతాలు, నదీ నదాలు, నగరాలు, పల్లెలు తలనొప్పి వచ్చేదాకా - ఏకాగ్రతతో పరికించాడు. ప్రపంచంలోని మూలమూలకీ దృష్టి ప్రసరింపచెయ్యగా - ఆఖరికి లక్ష్మీదేవి ఇనుప అరల మధ్య, మంచు కొండలు దాటి - ఎక్కడో పరాయి దేశంలో బంధింపబడి వుంది. వూరూ పేరూ, చిరునామా లేకుండా - రహస్యంగా స్విట్జర్లాండులో మారుమూల బాంకుల్లో బంధింపబడిన లక్ష్మీదేవి, నారాయణమూర్తి దివ్యదృష్టి తన మీద పడేసరికి - లాకర్లు చీల్చుకుని, మంచు పర్వత శ్రేణి దాటుకుని గభాలున నాథుడి గుండెల మీద వాలింది - గోముగా భర్త వంక చూస్తూ,

"చూశావా నన్ను అమాయకుడిని అన్నావ్. మనిషికి కోర్కెలు లేకుండా చేశాను. చూస్తావా?" అన్నాడు నారాయణమూర్తి విజయగర్వంతో భార్య వంక చూస్తూ.

ఆ దంపతుల - అన్యోన్యతా - ఆ వయసులో లక్ష్మీదేవి భర్త గుండెల మీద తలబెట్టుకుని - గారాలుపోవటం చూస్తూంటే శంకర్రావుకి ఒళ్లు మండింది. తను నాయకుడు అవుతాడు - దేశ ప్రధాని అవుతాడు. బాగానే వుంది. కాని వెర్రిబాగుల నారాయణమూర్తి తనకు పోటీగా తనలాంటివాడినే మరొకణ్ణి తయారుచేస్తే తన గతేమిటి? అందులోనూ భర్తకి ఇష్టం అయితే, భార్యకి తప్పకుండా అయిష్టం కలుగుతుంది. అది సర్వ సహజం. భర్తవైపు వాళ్లని పురుగుల్లా చూసే ఆడవాళ్లు చాలామంది వున్నారు. ఈవిడ మటుకు అలాంటి పని చెయ్యదని నమ్మకమేమిటి?

శంకర్రావు - గొంతు సవరించుకుని - అసంతృప్తిగా బయటికి చూస్తున్నాడు. ఆకాశ హర్మ్యాల వంటి - తన కోరికలకు ఈ నారాయణమూర్తి అడ్డు తగలపోతున్నాడా?

"ఏమిటి?... నీకింకా తృప్తిగా లేదా?"

"అదికాదు" నానుస్తున్నాడు శంకర్రావు.

"ఇంక కోరికలే లేవన్నావు. సంతృప్తిగా వుంటానన్నావ్."

"ఉంటాను. కానీ, నా పదవి శాశ్వతంగా వుండాలి."

"వుంటుంది."

"నాకు నమ్మకం లేదు."

"ఎందుకని."

"నాలాంటి వాణ్ణి మరొకణ్ణి మీరు తయారు చెయ్యరని నమ్మకం ఏమిటి?"

నారాయణమూర్తికి ఈసారి నిజంగానే కోపం వచ్చింది. "ఓరీ దౌర్భాగ్యుడా?" అన్నాడు. అటువంటి మాట భర్త నోటంట ఎన్నడూ వినని లక్ష్మీదేవి ఉలిక్కిపడి, నారాయణ మూర్తి కళ్లలోకి చూసింది భయంగా. ఆయన కళ్లు ఎర్రగా జ్యోతుల్లా వున్నాయి.

గ్లానుడు గంజి తాగినందుకు ప్రతిఫలంగా ఇన్ని చేస్తే ఈ మనిషి ఇంత నీచంగా ఆలోచిస్తున్నాడా? మనుషులు తమని తామే నమ్మరా? తమ నీడని చూసి తామే భయపడుతున్నారా? అనుమానం, భయం, ద్వేషం, అధికార దాహం - ఇవి తప్ప వీళ్లకి ఇంకేమీ తెలియవా? కృతజ్ఞత, దయా, దాక్షిణ్యం వీటిని మర్చిపోయిన ఈ మానవ జాతికి, తమని అనునిత్యం వెంటాడే శక్తి ఇంకోటి వుందని తెలియదా?

నిర్లిప్తంగా జాలిగా నవ్వుతున్న నారాయణ మూర్తిని చూసేటప్పటికి శంకర్రావుకి ఏదో భయం వేసింది. ఈ వ్యక్తిని ఇక్కడికిక్కడే హతమార్చేస్తే, తనకి ఇంకే భయం వుండదు. తన మాటకి - అధికారానికి ఎదురు వుండదు. తను తను ఈ దేశాన్ని తన గుప్పెట్లో తన ఏలుబడిలో వుంచుకోవాలి.

శంకర్రావు తన ప్రమేయం లేకుండా రెండు చేతుల్నీ ముందుకు జాచాడు - నారాయణ మూర్తి గొంతు పట్టుకునే ప్రయత్నంలో.

నారాయణమూర్తి ఒక్క అడుగు వెనక్కి వేశాడు. శంకర్రావుకి కనపడని నీడ - మృత్యు నీడ అతనికి స్పష్టంగా కనిపిస్తూ వుంది. 'మూర్ఖుడు - తను శాశ్వతం అనుకున్నాడీ మూర్ఖుడు. కంటికి కనపడని మరో మహాశక్తి తనిని నీడలా అంటి పెట్టుకుని వుంటుందని తెలుసుకోలేని ఇటువంటి పరమ మూర్ఖుడుకి కోర్కెలు లేకుండా చెయ్యటం సాధ్యమా? కాదు. అది అసాధ్యమైన పని.'

ఎత్తిన రెండు చేతులూ దించకుండానే గుండె ఆగిపోయి, అక్కడికక్కడే నేల మీదకి ఒరిగిపోయిన శంకర్రావుని చూస్తే నారాయణమూర్తికి జాలేసింది.

లక్ష్మీదేవి అన్నమాటల్లో సత్యం వుందేమో! నిజంగా తాను అమాయకుడా? భార్య వంక చిద్విలాసంగా చూడబోయాడు. కాని ఆ చిరుహాసంలో కాస్త సిగ్గు - తను పొరపాటు పడ్డానన్న పశ్చాత్తాపం లీలా మాత్రంగా తొంగి చూడగా - లక్ష్మీదేవి అల్లరిగా నవ్వుతూ చూసింది. ఆ అల్లరిలో - జాలి కూడా మిళితం అయింది. తన భర్త అమాయకుడే. అని మరోసారి తనలో తాను నవ్వుకుంది. ఆ నవ్వులో విజయగర్వం లేదు. తల్లి పసిబిడ్డని సముదాయించే లాలన, మాతృత్వపు ఛాయలు వున్నాయి. ఇప్పుడు నారాయణ మూర్తికి కోపం రాలేదు. లక్ష్మీదేవిపై కొండంత గురీ, నమ్మకం కలిగాయి. ❑